సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్‌కు అభినందనలు



డాక్టర్ సునీల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శానిటరీ సూపర్‌వైజర్లు

సింధియా: జీవీఎంసీ జోన్‌–5 ఏఎంహెచ్‌వోగా గురువారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సునీల్‌కుమార్‌కు 58, 59, 60, 61, 62, 63, 40 వార్డుల శానిటరీ సూపర్‌వైజర్లు ఘన స్వాగతం పలికారు. ఆయనను కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించి, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకు సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణ, ప్రజల ఆరోగ్యంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. గతంలో విశాఖ నగరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సాధించిన ర్యాంకుల స్ఫూర్తితో అధికారులు, ఉద్యోగులు. ప్రజా సంఘాలు, అన్ని రకాల స్వచ్ఛంద సంస్థలు, విశాఖ ప్రజలు కలిసి పనిచేస్తే జీవీఎంసీ మొదటి స్థానం దక్కించుకోగలదని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో గంట్యాడ గోవింద్, ఇతర సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

జీకేపై పిల్లలకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం చిన్నారులకు జనరల్‌నాలెడ్జిపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్ మాట్లాడుతూ 15 రోజుల నుంచి చిన్నారులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం పిల్లలకు నృత్యాలు, గీతాలపన కార్యక్రమాలతో పాటు లెమన్ స్పూన్, మ్యూజిక్ చైర్ ఆటలు ఆడించారు.

గాయపడిన వ్యక్తి మృతి



సోరెన్ మృతదేహం

గోపాలపట్నం: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 6న విమాన్‌నగర్‌లో సోరెన్ అనే వ్యక్తి ఎలక్ట్రికల్ పోల్ ఎక్కి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇది గుర్తించిన స్థానికులు, సచివాలయ మహిళా పోలీస్ ఆటోలో కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని ఆధార్ కార్డులో ఉన్న వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడి బంధువుల వివరాలు తెలియరాలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఉంటే సమాచారం ఇవ్వాలని ఎయిర్‌పోర్టు పోలీసులు కోరారు.

అనాథ యువతికి రక్షణ



జ్యోతిర్మయికి యువతి కీర్తనను అప్పగిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

అల్లిపురం: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఒక యువతిని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. గాజువాక ప్రాంతానికి చెందిన కె.కీర్తన తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో ఏడాది క్రితం మృతి చెందారు. సైకిల్ మీద వెళ్తున్న వారిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయారు. అప్పటి నుంచి ఆమె అనాథలా రోడ్డుమీదే ఉంటుంది. ఐదు రోజుల క్రితం ఆమె రైల్వేస్టేషన్‌లో ఉండగా జీఆర్‌పీ పోలీసులు ఆమెను గమనించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఆమెను షెల్టర్‌కు తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. కీర్తన డిగ్రీ చదువుకోవటంతో ఆమెకు ఉపాధి కల్పిస్తామని ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606



ఎండ అయినా తప్పని ప్రయాణం



ఎండ వేడిని తట్టుకోలేక నెత్తిన టవల్ వేసుకుని..

బాబోయ్ ఎండలు

- వడగాడ్పులతో ఉక్కిరి బిక్కిరి

మల్కాపురం: భానుడు తన ఉగ్రరూపాన్ని చూపాడు. గురువారం ఉదయం నుంచి భగభగలాడడంతో ప్రజలు విలవిల్లాడారు. ఉక్కపోత ఆపై ఎండ తీవ్రత పారిశ్రామిక వాసులను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆకు కూడా కదల్లేదు. గాలి వీచలేదు. ఉదయం 10 గంటల నుంచి వడగాడ్పులు ప్రారంభమయ్యాయి.దీంతో జనం ఇంట్లో ఉండలేక.. బయటకు రాలేక ఉక్కిరి బిక్కిరి అయ్యారు.పదేళ్లుగా ఎన్నడూ ఇలాంటి ఎండలు చూడలేదని పారిశ్రామిక వాసుల అంటున్నారు. తప్పనిసరై బయటకు వచ్చిన వారు గొడుగులు, కాటన్ వస్త్రాలను కవచంగా వేసుకున్నారు. నడినెత్తిన సూరీడ పడడంతో ఆపసోపాలు పడ్డారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని నిపుణులు తెలుపుతున్నారు. మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వివరిస్తున్నారు.



ఎండ వేడికి గొడుగు అడ్డు..

బ్రిజ్ భూషణ్‌పై చర్యలకు డిమాండ్



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

గోపాలపట్నం: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకుడు వెంకటరావు డిమాండ్ చేశారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష పదవి నుంచి బ్రిజ్ భూషణ్‌ను తొలగించి మహిళలకు అప్పగించాలని కోరారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. బ్రిజ్ భూషణ్, ఆయనకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ ఈ ఎన్నికల్లో ఉండకూడదని, వీటిని ప్రభావితం చేయరాదని పేర్కొన్నారు. రెజ్లర్లపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. గోపాలపట్నం డివిజన్ డీవైఎఫ్ఐ నాయకుడు నితిన్ మట్లాడుతూ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకొని, క్రీడాకారుల్లో మనోధైర్యాన్ని నింపాలన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దారుణమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు క్రీడాకారుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పృథ్వీ, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను బెహరా భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జీవీఎంసీ నిధుల నుంచి 22 విద్యుత్ స్తంభాలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తిన తర్వాత విద్యుత్ దీపాలు వేస్తామని తెలిపారు. వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి, షేక్ వల్లి, జగదీష్, శంకరరావు పాల్గొన్నారు.

భర్త చెంతకు భార్య



గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో దుర్గకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నరసింహారావు

గోపాలపట్నం: పాత గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ద్వారపూడి దుర్గను భర్త దేముడుకు గోపాలపట్నం పోలీసులు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 3న పుట్టింటి నుంచి దుర్గ భర్త ఇంటికి పాతగోపాలపట్నం వచ్చింది. భర్తతో గొడవల కారణంగా ఈ నెల 6న ఆస్పత్రికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి పోయింది. దీంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆమె సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా సికింద్రాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. సీఐ ఈదుల నరసింహారావు ఆమెతో ఫోన్‌లో మాట్లాడి ఒప్పించి ఇక్కడకు తీసుకువచ్చారు. కె. కోటపాడుకు చెందిన ద్వారపూడి దేముడుతో 2019లో వివాహం జరిగింది. 2020లో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత భర్తతో గొడవల కారణంగా కె.కోటపాడు సమీపంలో సూరెడ్డిపాలెంలో పుట్టింకి వెళ్లి పోయింది. నాలుగేళ్ల తర్వాత ఈ నెల 3న పాత గోపాలపట్నం వచ్చింది. మూడురోజులు ఉండి భర్తతో గొడవపడి వెళ్లి పోయింది.. ట్రైన్‌లో సికింద్రాబాద్ వెళ్లి పోయిన ఆమె ఆచూకీని సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకుని పట్టుకున్నారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. భర్త దేముడుకి అప్పగించారు.

ఆటో కార్మికుల మహా సభను జయప్రదం చేయండి



కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

మల్కాపురం: ఈ నెల 10న స్థానిక టీఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం 4వ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు గురువారం మల్కాపురం గ్రామ మండలి వద్ద కరపత్రాన్ని విడుదల చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రెహమాన్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పుడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో ఆటో వాలాల నుంచి వేలాది రూపాయిలు పన్నుల పేరిట వసూలు చేసి వారి జీవనానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఆటో కార్మికుల సమస్యలపై ఈ నెల పదో తేదీన జరిగే మహాసభలను కార్మికులంతా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుడాల రాంబాబు,గండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సముద్రాలను సంరక్షించుకుందాం



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: పర్యావరణంలో కీలక పాత్ర పోషిస్తున్న సముద్రాలను మనమంతా సంరక్షించుకోవాలని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ సముద్రాల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవాళికి అధికంగా ప్రాణవాయువు ఇచ్చేది సముద్రాలేనన్నారు. సముద్రం నుంచి ఆహారం లభిస్తుందని, రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దేశ రక్షణలో కూడా సముద్రం ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. అటువంటి సముద్రాన్ని కొంత మంది స్వార్థపరులు కలుషితం చేస్తూ సంపదకు హానీ కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కెమికల్స్ వంటివి సముద్రంలో కలపకుండా పాలకులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు



నిత్యకల్యాణంలో అప్పన్నకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.అర్చకులు పెదరాజు తదితరులు ఈ పూజ చేశారు. ఏఈవో నరసింహరాజు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



వివిధ శాఖల అధికారులతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

మహారాణిపేట: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. కమిషన్ ఆదేశాలతో వారం రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ నిర్వహిస్తున్న చైల్డ్ లేబర్ డ్రైవ్‌ను గురువారం కలెక్టరేట్ ఆవరణలో సీతారాం పరిశీలించారు. ప్రత్యేక బస్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లనున్న వివిధ శాఖల అధికారులను ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ బాలల బంగారు భవితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో వేల కోట్లు ఖర్చు చేసి చక్కని విద్యా, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాయని అన్నారు. ఇటువంటి తరుణంలో బాలలను కార్మికులుగా మార్చి వారి జీవితాలను అగమ్యగోచరం కానీయొద్దని అన్నారు. అధికారులు పీటీవీ లోవకుమార్, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.శిరీష, ఎ.ఆనంద్, లక్ష్మి, ప్రమీల, 1098 చైల్డ్‌లైన్ ప్రతినిధి మీనాకుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పి.భాస్కరరావు, జ్యోతి, శ్రీదేవి, కె.ఎల్లయ్య, పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిస్తోల్ కేసులో చురుగ్గా విచారణ

సీతమ్మధార : మహారాష్ట్ర నుంచి పిస్తోల్‌ను ఒడిశాకు తరలిస్తున్న శ్రీధర్ వారికిషన్ పతాంగిని ఫోర్తుటౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అలాగే పిస్తోల్ ఇచ్చి పంపించిన మహారాష్ట్రలోని జలానా జిల్లాకు చెందిన దత్తపవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ ఒకే చోట ఉంచి గురువారం విచారణ చేపట్టారు. అసలు పిస్తోల్ ఎవరు ఇచ్చారు..?, ఎక్కడి నుంచి వచ్చింది..? అన్న కోణంలో ఆరా తీశారు. అయితే ఈ ఇద్దరూ చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో దత్త పవర్‌ని ప్రత్యేకంగా విచారించారు. సందీప్ అనే వ్యక్తి నుంచి కోనుగోలు చేసినట్లు దత్త పవర్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రోజుకో కొత్త పేరు వెలుగులోకి రావడం పోలీసులకు తలనొప్పిగా మారింది. గతంలో ఆత్మరక్షణ కోసమని చెప్పి... ప్రస్తుతం సందీప్ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఆ వ్యక్తిపై పోలీసులు దృష్టి సారించారు. అసలు పిస్తోళ్లు ఎవరు సరఫరా చేస్తున్నారు అన్న కోణంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి సదస్సు రేపు

డాబాగార్డెన్స్: శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో భారతీయతలో–అమృతకాలం అనే అంశంపై ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు ప్రోగ్రామ్ కన్వీనర్ ఎస్.రాధాకుమారి తెలిపారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరగనున్న సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఆచార్యులు పాల్గొని జ్యోతిష్యం, ఆరాధ్య వ్యవస్థ, ఆలయ వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, శిక్షణ వ్యవస్థ, ఆధ్యాత్మికత–భారతీయత, ఆర్థ వ్యవస్థ ఇలా అనేక అంశాలపై ప్రసంగిస్తారన్నారు. విశాఖలో తొలిసారిగా మానవాళి మనుగడకై వివిధ అంశాలపై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సుకు నగర వాసులు విచ్చేయాలని కోరారు.

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయి ధ్యాన మందిరంలో గురు పౌర్ణమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు జూలై 3న నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించి సాయి నామజపంతో ఏకాహం పూర్తి చేశారు.

గుంతలు పూడ్చరూ!

- జీవీఎంసీ 90వ వార్డులో అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గాంధీనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



ఇరుకు రహదారి దుస్థితి

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డులో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గతంలో మంచినీటి సరఫరా కోసం తవ్విన గోతులు మట్టితో తూతూమంత్రంగా పూడ్చి వదిలేశారు. అవి ఇప్పుడు తమ పాలిట ప్రాణశంకటంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తై దాదాపు ఏడాది కావొస్తున్నా అధికారులు అటువైపు చూడడం లేదు. దీంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత గుంతలమయంగా తయారయ్యాయి. వాటిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఈ వార్డులో గాంధీనగర్, రెడ్డి వీధి, గవర వీధి, జయప్రకాష్‌నగర్, చిన్నబుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, సుసర్ల కాలనీ ఇలా పలు వీధుల్లో ఇదే పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల మరీ ఘోరంగా ఏర్పడిన గొయ్యల్లో పడి పిల్లలు వృద్ధులు ద్విచక్రవాహనచోదకులు తరచూ గాయాలపాలవుతున్నారని ఆవేనద వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొన్ని వీధుల్లో ఇరుకు రోడ్లు కావడం.. అందునా గొయ్యలు పూడ్చకుండా వదిలేయడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. వర్షాకాలం వస్తుందని గోతులు మరింత పెద్దవి ఏర్పడతాయని వాపోతున్నారు. వర్షాలు కురవక ముందే గోతులను సిమెంట్‌తో పూడ్చాలని కోరుతున్నారు.

‘త్వమేవ శరణం మమ’ గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం నారాయణరావు

ఉక్కునగరం: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వి.ఎస్.ఆర్. మూర్తి రచించిన ‘త్వమేవ శరణం మమ’ గ్రంథాన్ని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ నారాయణ రావు గురువారం ఆవిష్కరించారు. స్థానిక సత్యసాయి మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో రచయిత మూర్తి మాట్లాడుతూ మానవాళికి సేవానిరతికి మార్గదర్శకంగా నిలిచిన భగవత్ స్వరూపం సత్య సాయిబాబా అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అన్న మార్గంలో 150కు పైగా దేశాల్లో కోట్లాది మంది భక్తుల్లో సేవాభావం, స్ఫూర్తిని కలిగించిన మహా వ్యక్తి సత్యసాయి అన్నారు. సత్యసాయిని దర్శించుకుని 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆవిష్కరించుకుంటున్న గ్రంథమిది అని తెలియజేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

కిడ్నీ పరిశోధనలకు అమెరికా స్కూల్ సహకారం



అమెరికాలో హెచ్ఎంఎస్ వైద్యులతో డాక్టర్ రవిరాజ్

- ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజ్

మహారాణిపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ వ్యాధులపై చేస్తున్న పరిశోధనలకు అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూలు (హెచ్ఎంఎస్) సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని ప్రముఖ నెఫ్రాలజిస్టు, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ రవిరాజ్ హార్వర్డ్ మెడికల్ స్కూలును సందర్శించారు. అక్కడి నెఫ్రాలజీ విభాగం ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లిన ఆయన ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేపట్టారు. తన పరిశోధనకు సహకారం అందించాలని డాక్టర్ రవిరాజ్ కోరారు. దీనికి హెచ్ఎంఎస్ నెఫ్రాలజీ విభాగం నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ప్రభుత్వం అనుమతి ఇస్తే పలాసలో కొత్తగా నిర్మిస్తున్న కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో వారి సహకారం ఉపయోగించుకోవచ్చని డాక్టర్ రవిరాజ్ తెలిపారు. 1995 నుంచి 2000 మధ్యలో ఉద్దానం నుంచి కేజీహెచ్‌కు ఎక్కువ కిడ్నీ బాధితులు వచ్చే వారని ఆయన తెలిపారు. దీంతో ఉద్దానం వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. తమ పరిశోధనలో అక్కడి ప్రజల్లో 18.5 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నారని గుర్తించామన్నారు. నీరు, ఆహారం ఇతర వనరులపై పరిశోధనలు చేసినా కారణాలు తెలియలేదన్నారు. హెచ్ఎంఎస్ సహకారంతో చేసే పరీక్షలతో పాటు జన్యు పరిశోధనలు కీలకం కానున్నాయన్నారు.

నోడల్ ఏజెన్సీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: విభిన్న ప్రతిభావంతులకు ఉపయుక్తంగా పునరావాస కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నోడల్ ఏజెన్సీ స్థాపనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సూచనలతో విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల సేవలు అందించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల కోసం పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ, ప్రభుత్వయేతర స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు ఈ నెల 17వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు. వివరాలకు www.socialjustice.gov.in వెబ్‌సైట్‌లో గాని పెదవాల్తేరులోని రాణి చంద్రమణి దేవి ఆసుపత్రి ఆవరణలో ఉన్న సహాయ సంచాలకుల కార్యాలయంలో గాని, 0891–2952585 ఫోన్ నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com